జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 6-12-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 529 పేజీలు: 4 వెల : రూ.7



# వణికిస్తోన్న.. వింత జ్వరం

* రోజురోజుకూ జిల్లాలో ప్రబలుతున్న స్క్రబ్ టైఫస్
* ఈ వ్యాధి లక్షణాలతో కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు
* అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యఆరోగ్యశాఖ

శ్రీకాకుళం, డిసెంబర్ 5 (వార్త): గత కొన్ని నెలలుగా వీడని జ్వరం.. విపరీతమైన తలనొప్పి.. ఒళ్లు నొప్పులతో జిల్లావాసులు బాధపడుతున్నారు. ఇంజక్షన్లు వేసుకున్నా.. మాత్రలు తీసుకున్నా తగ్గడం లేదు. ఇది స్క్రబ్ టైఫస్ జ్వరం లక్షణాలని వైద్యులు గుర్తించారు. గతనెలలో హిరమండలం మండలంలో పలువురిలో ఈ వింతజ్వరాలు కనిపించాయి. ఈ తరహా జ్వరాల బారిన పడిన రోగులు గత రెండేళ్ల నుంచి సుమారు 400 కేసుల వరకు నమోదయ్యాయని వైద్యులు చెబుతున్నారు. సాధారణ జ్వరంలా కనిపించే స్క్రబ్ టైఫస్‌ను సకాలంలో గుర్తించకుంటే ప్రాణాలు సైతం కోల్పోతారని అంటున్నారు. దట్టమైన చెట్లు, వ్యవసాయ భూములు పక్కన నివసించే వారికి ఎక్కువగా స్క్రబ్ టైఫస్ వ్యాధి సోకుతుంది. చెట్లు, పొలాల్లో ఉండే "త్సుట్సుగాముషి" అనే కీటకం కుట్టడం ద్వారా జ్వరం వస్తుంది. ఈ కీటకాల్లో కొన్ని తీవ్రమైన ప్రభావం చూపుతాయి. కొందరికి వారం రోజుల వ్యవధిలో వ్యాధి సోకుతుందని, మరి కొందరిలో కొన్ని గంటల వ్యవధిలోనే తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్యులు చెబుతున్నారు. త్సుట్సుగాముషి కీటకం కుట్టిన వారిలో జ్వరం అకస్మాత్తుగా రావడం, తీవ్రమైన తలనొప్పి, చలి, కండరాల నొప్పి, దగ్గు వంటి లక్షణాలు ఉంటాయి. కళ్లు తిరగటం, మగత,వాంతులు కూడా అవుతుంటాయి. ఇలాంటి వారి శరీరంపై పరిశీలిస్తే కీటకం కుట్టిన ప్రాంతంలో నల్లటి మచ్చ కనిపిస్తుంది. ఈ వ్యాధిని నిర్ధారించేందుకు ఎలిసా పరీక్షలు సైతం చేయాల్సి ఉంది. మధుమేహం, అధిక రక్తపోటు ఉన్నవారికి సోకితే ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది.అంతే కాకుండా హెచ్ఐవీ రోగులకు సోకితే ప్రాణాంతకమే. చిన్న పిల్లలు,వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి స్క్రబ్ టైఫస్ సోకినట్లయితే ప్రమాదకరంగా మారుతుంది.



## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

జిల్లాలోని ప్రజలందరూ స్క్రబ్ టైఫస్ వ్యాధి నియంత్రణ, నివారణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖాధికారులు, జిల్లాలోని ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్లతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఐదు రోజులు పూర్తిగా జ్వరం తగ్గని వారు స్క్రబ్ టైఫస్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. 'చిగ్గర్ మైట్' అనే కీటకం కుట్టడం ద్వారా ఈ ఇన్ఫెక్షన్ మనుషులకు సోకుతుందని వివరించారు. ప్రజలు ఎటువంటి భయభ్రాంతులకు గురికావాల్సిన అవసరం లేదని, వ్యాధి నిర్ధారణకు సరిపడా కిట్‌లను అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. అయితే, ప్రభుత్వ నిబంధనలకు లోబడే ప్రైవేట్ ల్యాబ్‌లు పరీక్షల ధరలను నిర్ధారించాలని ఆదేశించారు. ఈ వ్యాధి ముఖ్యంగా పొదలు, గడ్డి, పొలాలు, అడవి ప్రాంతాల్లో ఉండే చిగ్గర్లు కుట్టడం వల్ల వస్తుందని, వ్యవసాయ పనులు చేసేవారు, పశువుల పాకల్లో తిరిగేవారికి ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, అధిక జ్వరం, తీవ్ర తలనొప్పి, శరీర బలహీనత, వాంతులు ఈ వ్యాధి లక్షణాలుగా ఉంటాయని, కీటకం కుట్టిన చోట నల్లటి మచ్చ కూడా కనిపించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనిత చెప్పారు. స్క్రబ్ టైఫస్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. పొలాలు, పొదల్లో పనిచేసేటప్పుడు శరీరాన్ని పూర్తిగా కప్పే దుస్తులు ధరించాలని, చేతులు, కాళ్లపై కీటకనాశక లోషన్ ఉపయోగించాలని సూచించారు. పశువుల పాకలు, ఇళ్ల చుట్టూ ఉన్న గడ్డి, కలుపు మొక్కలు తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచడం ద్వారా ఈ వ్యాధి రాకుండా నివారించవచ్చని తెలిపారు. స్క్రబ్ టైఫస్‌కు సమర్థవంతమైన చికిత్స ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందుబాటులో ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. జ్వరం, శరీర బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని పీహెచ్‌సీ లేదా ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులను సంప్రదించాలన్నారు. సొంతంగా మందులు కొనుగోలు చేయకుండా, వైద్యులు సూచించిన యాంటీ బయాటిక్స్‌ను సమయానికి తీసుకోవాలని కోరారు. ముందుగానే చికిత్స ప్రారంభిస్తే వ్యాధి పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. ప్రజలు ఈ జాగ్రత్తలు పాటించడం ద్వారా స్క్రబ్ టైఫస్‌ను సులభంగా నివారించవచ్చని, చికిత్సతో పూర్తిగా నయం చేయవచ్చని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డిసిహెచ్ఎస్ కళ్యాణ్ బాబు, జి జి హెచ్ నుంచి పలు విభాగాధిపతులు, జిల్లాలోని పలువురు ల్యాబ్ టెక్నీషియన్లు హాజరయ్యారు.

# పండగలా.. మెగా పీటీఎం



* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు * బాలికోన్నత పాఠశాలలో మెగా పేరెంట్ మీటింగ్

**టెక్కలి, డిసెంబర్ 5(వార్త):** విద్యతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. టెక్కలి జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఈ మెగా పేరెంట్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నామని, విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని తెలిపారు. అభ్యసన ఫలితాలే లక్ష్యంగా పాఠశాల విద్యలో నూతన సంస్కరణలు తీసుకురాబోతున్నామని మంత్రి ప్రకటించారు. డీఎస్సీ అంటే టీడీపీ... టీడీపీ అంటే డీఎస్సీ" అని అన్నారు. తమ ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకుందని స్పష్టం చేశారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలు మూతపడే పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు, విద్యకు ఇస్తున్న ప్రాధా న్యత కారణంగా అవి మళ్లీ తెరుచుకుంటున్నాయని అన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ మెగా పేరెంట్ టీచర్ సమావేశాల ముఖ్య ఉద్దేశాన్ని గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.4వేల కోట్లతో కృషి చేస్తుందని, ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తగ్గకుండా ప్రభుత్వ పాఠశాల లను ఆధునీకరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పేరెంట్-టీచర్ మీటింగ్ అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పాఠశాలలో ఉన్న వసతులు, బోధన నాణ్యత, మధ్యాహ్న భోజన ప్రమాణాలపై చర్చించిన మంత్రి... వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్డీవో కృష్ణమూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావడంతో పండగ వాతావరణం నెలకొంది.

# 'కలలకు రెక్కలు' పథకంతో.. విదేశీ విద్యకు ప్రోత్సాహం

* సీఎం చంద్రబాబు * భామినిలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ * హాజరైన మంత్రులు




**భామిని, డిసెంబర్ 5 (వార్త):** విద్యార్థుల ఉన్నత విద్యకు, విదేశీ విద్యకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దీనికోసం 'కలలకు రెక్కలు' పథకాన్ని ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. విదేశీ విద్య కోసం ఎంత ఖర్చు అవుతుందో అంత మేర పావలా వడ్డీకే రుణం ఇప్పిస్తామని సీఎం ప్రకటించారు. ఉన్నత, విదేశీ విద్య అభ్యసించాలనే కోరికలు, ఆశలను విద్యార్థులు చంపుకోవాల్సిన అవసరం లేదన్నారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్-3.0 కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటించారు. భామిని గ్రామంలో ఏపీ మోడల్ హైస్కూల్లో జరిగిన పీటీఎం 3.0 కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేరెంట్, టీచర్, విద్యార్థులతో సీఎం మాట్లాడారు. మోడల్ స్కూల్లో ఏర్పాటు చేసిన వివిధ ల్యాబ్స్‌ను పరిశీలించారు. అలాగే క్లిక్కర్ టూల్ ద్వారా విద్యార్థులకు ఎలాంటి బోధన చేస్తున్నారనే అంశాన్ని స్వయంగా పిల్లలతో కలిసి కూర్చుని చూశారు. ఈ సందర్భంగా భామిని ఏపీ మోడల్ స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ...'రాబోయే కాలంలో విద్యా వ్యవస్థలో ఎవ్వరూ ఊహించని ఫలితాలు వస్తాయి... దీనికి అందరూ సహకరించాలి. మూడేళ్లలో దేశంలోనే నెంబర్ వన్ చేసేలా ఆంధ్రా స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ తెస్తానని మంత్రి లోకేష్ చెప్పారు. పిల్లలను సానబెడితే అద్భుతాలు సాధిస్తారు. విద్యలో పిల్లల బలాబలాలు తెలుసుకునేందుకు... దానికి అనుగుణంగా విశ్లేషించుకుని స్కై, మౌంటెన్, స్టీమ్ అనే మూడు రకాలుగా వర్గీకరించారు. క్లిక్కర్ అనే విధానం పిల్లలను మరింత ఆసక్తిగా చదువుకునేలా చేస్తోంది. నేను అనుకున్నదానికంటే విద్యా విధానం మెరుగ్గా ఉంది. పిల్లలు కూడా వాటిని అందిపుచ్చుకుంటున్నారు. పరీక్షలు జరిగిన తర్వాత సమర్థత తెలుసుకోవడం కాకుండా... ఎప్పటికప్పుడు పిల్లల చదువును విశ్లేషించేలా క్లిక్కర్ బాగా పని చేస్తోంది. పిల్లలు మట్టిలో మాణిక్యాలు... సరైన గైడెన్స్ ఉంటే ఏదైనా సాధించగలరు. అంధ క్రికెట్ క్రీడాకారిణి కరుణ కుమారి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని అంధ మహిళల క్రికెట్ ప్రపంచ కప్‌ను సాధించింది. విద్యా విధానానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది... నిరంతరం ఫీడ్ బ్యాక్ తీసుకుంటోంది. అందుకే మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టామని చంద్రబాబు అన్నారు.

## కష్టంగా కాదు... ఇష్టంగా చదవండి

'ఒకప్పుడు పిల్లలు భారం అనుకునేవారు... కానీ ఇప్పుడు పిల్లలే ఆస్తి, పిల్లలే శ్రీరామ రక్ష, పిల్లలే భవిష్యత్ అని చంద్రబాబు అన్నారు. మధ్యాహ్న భోజనం నుంచి స్టూడెంట్ కిట్స్ వరకు నాణ్యత పెంచాం. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా, నాణ్యతతో అందిస్తున్నాం. స్టూడెంట్ కిట్లపై పార్టీ రంగులు, చిహ్నాలు, ఫొటోలు లేకుండా అందిస్తున్నాం. విలువలతో కూడిన సమాజాన్ని అందించాలనే ఉద్దేశంతో పని చేస్తున్నాం. దానికి సహకరించాలని చాగంటి కోటేశ్వరరావును కోరామన్నారు. చాగంటి ప్రవచనాల ద్వారా విలువలను విద్యార్థులు చక్కగా అర్థం చేసుకుంటున్నారు. గతంలో టీచర్లకు చాలా యాప్‌లు ఉండేవి. ఇప్పుడు అలాంటి ఇబ్బందులను తొలగించాం. శనివారం నో బ్యాగ్ డే... ఆడుతూ పాడుతూ విద్యార్థులకు నచ్చిన పని చేస్తున్నారు. 24 గంటలు రుద్దితే చదువు అబ్బదు.. ఇష్టంతో తక్కువ సమయం చదివినా రాణిస్తారు. చదువులో వెనుకబడ్డ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. షైనింగ్ స్టార్స్ పేరుతో ప్రతిభా అవార్డులు ఇస్తున్నాం. విద్యలో నాణ్యత ప్రమాణాలను పరిశీలించేందుకు క్లస్టర్ అప్రోచ్ ద్వారా ప్రయత్నిస్తున్నాం. ప్రపంచంలో ఉన్న బెస్ట్ లెర్నింగ్ విధానాలు అధ్యయనం చేస్తున్నాం. విదేశాలకు వెళ్లి టీచర్లు అధ్యయనం చేస్తున్నారు. టీచర్లను రిక్రూట్ చేయకుండా చదువు చెబితే అది బూటకమే అవుతుంది. ప్రభుత్వ టీచర్లను నియమించాం... చక్కటి చదువు చెప్పిస్తున్నాం. మెగా డీఎస్సీని అడ్డుకునే ప్రయత్నం చేశారు. కానీ దాన్ని సమర్థంగా ఎదుర్కొని ఏడాదిలోనే ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశాం. ట్రాన్స్‌ఫర్లను పారదర్శకంగా నిర్వహించాం. పిల్లలకు అవసరమైన విద్యను అందిస్తాం... దాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. అలాగే సామాజిక బాధ్యతగా డ్రగ్స్ వ్యతిరేక ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టే బాధ్యత విద్యార్థులకూ ఉంది.' అని సీఎం సూచించారు.

# క్రైం వార్తలు

## పొందూరులో రెండిళ్లలో చోరీ

**శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 5 (వార్త):** పొందూరు గాంధీనగర్‌లో మాడుగుల లక్ష్మి ఇంటిలో, రెండో వీధిలోని ఎచ్చెర్ల పైడి రాజు ఇంట్లో గురువారం రాత్రి దొంగలు పడి బంగారు ఆభరణాలు, నగదు దోచుకుపోయారు. తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించి ఇచ్చిన సమాచారంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాలను క్లూస్‌టీం సందర్శించి వివరాలు సేకరించింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

## బ్యాగును కోసి రూ.3 లక్షలు చోరీ

శ్రీకాకుళం నగరంలోని బొందిలీపురం శివరాంనగర్ కాలనీకి చెందిన వృద్ధుడు సక్కరి సత్యాగోపి శుక్రవారం సింహ ద్వారం వద్ద ఉన్న ఎస్‌బీఐ నుంచి రూ.4లక్షలు తీసుకున్నాడు. బ్యాగ్‌లో నగదు పెట్టుకుని ఉదయం 11 గంటల ప్రాంతంలో సింహద్వారం వద్ద ఆటో ఎక్కాడు. వెంకటాపురం జంక్షన్ వద్ద ముగ్గురు యువకులు ఆటో ఎక్కి కొంతదూరం ప్రయాణించి, సగంలోనే దిగిపోయారు. అయితే వృద్ధుడు సక్కరి సత్యాగోపి కొంత దూరం వెళ్లి చూసేసరికి బ్యాగ్ కట్ చేసి ఉండడాన్ని గమనించారు. అందులోని రూ.3 లక్షలు కనిపించకపోవడంతో లబోదిబోమన్నారు. వెంటనే టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శబరిమలలో జిల్లావాసి మృతి

రాగోలు పంచాయతీ కూటికుప్పలవానిపేటకు చెందిన గురుగుబెల్లి వరహానరసింహులు(72) కేరళ రాష్ట్రం శబరిమలలో శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందినట్టు తోటి స్వాములు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వివరాల్లోకి వెళితే ఈనెల3న గ్రామానికి చెందిన అయ్యప్పస్వాములతో కలిసి వరహా నరసింహులు శబరిమలకు వెళ్లారు. శుక్రవారం వేకువ జామున శబరిమల కొండకు చేరుకున్న తరువాత వరహా నరసింహులకు గుండెపోటు వచ్చి కుప్పకూలిపోయాడు. సమీపంలో ఆసుపత్రికి అంబులెన్సులో తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

## 8 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

గంజాయితో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మడపాం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. బరంపురం నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న లారీలో ఇద్దరు వ్యక్తులు బ్యాగ్‌లో ఎనిమిది కిలోల గంజాయితో పట్టుబడ్డారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన శుభమ్ గౌడ, దీపక్ మాత్రిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికీ జరిమానా

సారవకోట పోలీసు స్టేషన్ పరిధిలో రహదారి భద్రత, ప్రమాదాల నివారణలో భాగంగా ఎస్సై అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించిన సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో లండ అప్పన సత్యవరం (నరసన్నపేట మండలం), అర్జీ సత్యనారాయణ (శ్రీకాకుళం టౌన్) పట్టుబడ్డారు. వారు మద్యం తాగి వాహనం నడుపుతున్నారు. వీరిని పాతపట్నం కోర్టు మెజిస్ట్రేట్ ఎం. రోషిని ముందు హాజరుపరిచారు. విచారణ అనంతరం కోర్టు మెజిస్ట్రేట్.. ఒక్కొక్కరికి పదివేలు చొప్పున జరిమానా విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

# జగన్‌ని కలిసిన జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి శ్రీరామ్



**జి.సిగడాం, డిసెంబరు5(వార్త):** తాడేపల్లిలోని వైసీపీ క్యాంప్ కార్యాలయంలో వైస్సార్ సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డిని శ్రీకాకుళం జిల్లా,జి.సిగడాం మండలం,దవళ పేట గ్రామానికి చెందిన జిల్లా వైఎస్సార్ సీపీ కార్యదర్శి, న్యాయవాది పేడాడ శ్రీరామమూర్తి మర్యాదపూర్వకంగా కలిసారు. జిల్లా, నియోజకవర్గ సమస్యలపై జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసువెళ్లారు. అయన సానుకూలంగా స్పందించారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం,పార్టీ బలోపేతం తదితర అంశాలపై జగన్ మోహన్ రెడ్డి దిశానిర్దేశం చేశారని వైసిపి నాయకులు కార్యకర్తలు అధైర్య పడవద్దని తమకు నేను అండ ఉంటానని భరోసా ఇచ్చారని తెలిపారు.

# వెల్లివిరిసిన గిరిజన విద్యా చైతన్యం

**-కిచెన్ నిర్మాణానికి ముందుకు వచ్చిన గిరిజనులు**
**రూ.1.06లక్షలతో వంటగదిని నిర్మించిన దాతలు**

**మందస, డిసెంబరు 5(వార్త):** అదో గిరిజన కుగ్రామం.. మండల కేంద్రమైన మందసకు దూరంగా ఉంది.. గిరిజనులంతా పేదవారే.. కానీ, వారిలో విద్యా చైతన్యం వెల్లివిరిసింది.. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని.. ఎదురు చూడలేదు. తమ సమస్యను తామే పరిష్కరించుకుందామని తీర్మానించుకున్నారు. అనుకున్నదే తడవుగా ఆ గ్రామ గిరిజనులంతా ఏకమై.. తమ గ్రామ విద్యాలయానికి ఓ వంటగదిని నిర్మించాలని నిర్ణయించారు. తోచినంతా విరాళమివ్వడానికి ముందుకు వచ్చారు. ఇదంతా మందస మండలంలోని మారుమూల గిరిజన పల్లె కుసుమలలో జరిగింది. కుసుమలలో పాఠశాల ఉన్నప్పటికీ, వంటగది లేకపోవడంతో మధ్యాహ్న భోజనాలు వండడానికి ఇబ్బందులు ఎదురయ్యేవి. పాఠశాల ఆవరణలో వంట చేస్తుండడంతో విద్యార్థులు ఒక్కోసారి వస్తున్న పొగ విద్యార్థులకు సమస్యగా మారింది. దీంతో వారంతా ఈ వంటగదిని నిర్మించారు. ముందుగా సర్పంచ్ సవర సుధాకర్‌తో పాటు వార్డు మెంబర్లు రూ.14వేలను అందించారు. అదేవిధంగా జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కుప్పాయి గోపాలరావు రూ.5వేలు, టీడీపీ నాయకుడు ఎస్.అప్పన్న రూ.5వేలు అందించారు. కుసుమాల గ్రామస్తులు ఇంటికి రూ.500 వంతున రూ.32,000లు, కె.నాయుడు (హెచ్ఎం), వి.మంజుల, ఆంజనేయులు, ఎస్.జగబంధు, కె.బుజ్జి, ఎస్.కోటేశ్వరరావు, ఎస్.తాతారావు తదితరులు రూ.5000లు వంతున, ఎస్.ప్రశాంత్ రూ.3,000లు విరాళాలు అందజేశారు. ఆదేవిధగా మరి కొంతమంది తోచిన విధంగా సాయమందించారు. ఈ భవనాన్ని మందస మండల విద్యాశాఖాధికారి మర్రిపాటి లక్ష్మణరావు ప్రారంభించారు. గిరిజనుల పట్టుదల, అంకితభావాన్ని అభినందించారు.

గిరిజనులు, చిన్నారుల కేరింతలు, ఆనందోత్సవాల భవనం ప్రారంభించుకున్నారు. ప్రతీ ఒక్కరూ గిరిజనులు చూపిన స్ఫూర్తితో ప్రభుత్వ పాఠ శాలలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. పేద గిరిజనులు నిర్మించుకున్న వంట గది నిర్మాణంపై అధికా రులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. గిరిజ నులు పట్టుదల ఇతరులకు ఆదర్శం కావాలని కోరారు.



## విద్యార్థి దశలోనే భవిష్యత్ పునాది వేసుకోవాలి



**జి.సిగడాం, డిసెంబరు 5(వార్త):** సమాజాభివృద్ధి విద్యతోనే సాధ్యమని బీజేపి మండల అధ్యక్షులు పైల విష్టుమూర్తి, ఎఎంసీ ఉపాధ్యాక్షులు బురాడ వెంకటరమణ అన్నారు. శుక్రవారం జి.సిగడాం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తలిదండ్రుల ఉపాధ్యయులు ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిధిగా పాల్గొని మాటాడారు. విద్యార్థి దశలోనే భవిష్యత్ కు పునాది వేసుకోవాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్ల భవిష్యత్ కోసం ఎన్నో కళలు కంటారు వారి కళలను సాకారం చేసి వారిలో అనందాన్ని కలిగించాలన్నారు. పేదరికంలో పుట్టిన ఎందరో దేశనాయకులుగా, దేశ ప్రధమ పౌరులుగా నిలిచారని గుర్తు చేసారు. చెడు అలవాటకు దూరంగా ఉంటూ చదువు పై దృష్టిసారించి ఉత్తమ విద్యార్థులు మెలగి ఉన్నత స్థానంలో ఉండాలన్నారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పెద్దలకు గౌరవిస్తూ క్రమశి క్షణతో మెలగాలన్నారు. విద్యార్థి అనుకుంటే సాదించలేనిది ఏమీ లేదని అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## లఘు నాటికతో ఆకట్టుకున్న విద్యార్థులు




**సారవకోట, డిసెంబరు 5(వార్త):** సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్ఎం. ఆర్.రామకృష్ణ అధ్యక్షతన మెగా పేరెంట్ మీట్ ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఆర్వో, ఎంఈవో విచ్చేసి విద్యార్థులను, ఉపాధ్యాయులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో సైన్స్ మాస్టర్ ఎస్.శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'విద్యార్థి ఎదుగుదలలో కీలకం ఎవరు' అనే లఘు నాటిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల వాతావరణం ఎంత ముఖ్యమో చాటి చెప్పే ఈ ప్రదర్శనకు మంచి స్పందన లభించింది. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల, ప్రగతిపై ఉన్న సందేహాలను ఉపాధ్యాయులతో చర్చించి నివృత్తి చేసుకున్నారు. విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సమగ్రాభివృద్ధి దిశగా ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అధికారులు అభిప్రాయపడ్డారు. సమావేశం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో సందడిగా ముగిసింది.

## మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



**నరసన్నపేట, డిసెంబరు 5(వార్త):** సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 13న నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్తును విజయవంతం చేయాలని సివిల్ జడ్జి ఎస్.వాణి సూచించారు. శుక్రవారం నరసన్నపేట మున్సిపల్ మెజిస్ట్రేట్ కార్యాలయంలో సర్కిల్ పరిధిలోని పోలీస్ ఉన్నతాధికారులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాజీ సాధ్యమైన కేసులను ముందుగా గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజ లకు త్వరిత న్యాయ పరిష్కారం అందించడంలో లోక్ అదాలతలు కీలకమని, అందుకు పోలీసు శాఖ సమన్వయం అత్యంత ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. మెగా లోక్ అదాలతను విజయవంతం చేయడానికి అన్ని విభాగాలు సమష్టిగా కృషి చేయాలని, ప్రజలు సులభంగా న్యాయం పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## కర్రసాముతో ఆకట్టుకున్న విద్యార్థులు



**పోలాకి, డిసెంబరు 5(వార్త):** పోలాకి పాఠశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ పైడి ప్రవీణ ఆధ్వర్యంలో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు తోపాటుగా పాఠశాల ఛైర్మన్ ముఖ్య అతిథిగా కాలింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోనంకి కృష్ణం నాయుడు హాజరై విద్యార్థులను, ఉపాధ్యాయులను ఉత్సాహపరిచారు. ప్రిన్సిపల్ ప్రవీణ విద్యార్థుల విద్యా ప్రగతి, వారిలో కనిపిస్తున్న మార్పులు, అభివృద్ధి చర్యల గురించి తల్లిదండ్రులకు వివరణాత్మకంగా తెలియజేశారు. పాఠశాల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు కోసం తీసుకుంటున్న చర్యలపై కూడా సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన కర్రసాము, మార్చ్ ఫాస్ట్ కార్యక్రమాలు సమావేశానికి హాజరైన ఆహుతుల అభినందనలు అందించాయి. విద్యార్థుల ప్రతిభ, క్రమశిక్షణ, శారీరక దృఢత్వాన్ని ప్రతిబింబించే ఈ ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తల్లిదండ్రులు కూడా పాఠశాల నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రశంసిస్తూ, పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్రను అభినందించారు. మోతంగా, మెగా %్రూవీ% సందడి, సంబరాలతో విజయవంతంగా ముగిసింది.

## బూత్ కమిటీలు సక్రమంగా పని చేయాలి

**మందస, డిసెంబరు 5(వార్త):** పోలింగ్ బూత్ కమిటీలు సక్రమంగా పని చేయాలని ఇచ్ఛాపురం ఏఎంసీ చైర్మన్ బి.మణి చంద్రప్రకాష్ రెడ్డి కోరారు. మందస మండలంలోని హరిపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల గ్రామ పంచాయతీ పరిధిలో గల వెనకబడి ఉన్న గ్రామ బూత్ కమిటీలు తమ లక్ష్యం నెరవేర్చాలన్నారు. ఈ సందర్భంగా కమిటీల ముఖ్య ఉద్దేశాన్ని తెలియజేస్తూ, పంచాయతీ పరిధిలో కొన్ని బూత్ లు వెనకబడి ఉండడం గల కారణాలు, అందులో గల లోపాలు, ఇతరేతర కారణాలు గురించి తెలుసుకున్నారు. ఏం చేస్తే బూత్ బలోపేతానికి దోహదపడుతాయనే అనే అంశాన్ని గురించి చర్చించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, కొర్ల కన్నారావు, తమరియ భాస్కరరావు, దాసరి తాతారావు, డుంకురు తిరుపతి, బమ్మిడి కర్రయ్య, ముంజేటి చంద్రశేఖర్, ముడుముంచి నవీన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# తల్లిదండ్రులతో ఆత్మీయ సమావేశం



**జి.సిగడాం, డిసెంబరు 5(వార్త):** తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే పాఠశాలల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) అన్నారు. శుక్రవారం సంతవురిటి గ్రామం ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 3.0 మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. మహాత్మ గాంధీ, సరస్వతి దీవి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ప్రతి సంవత్సరం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసిందన్నారు. మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ యువనాయకుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఆలోచన అన్నారు. ప్రభుత్వ పాఠశాల నుంచే అనేక మంది ఐఏఎస్‌లు, ఏపీఎస్‌లు, ఇంజనీర్లు, డాక్టర్లు అయ్యారన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులపై ఒత్తిడి పెంచవద్దని, వారికి ఇష్టమైన విద్యనే చదివించా లన్నారు. విద్యా ర్థులు చక్కటి క్రియేటివిటీతో వినూత్నంగా ఆలోచిస్తూ సత్ఫలితాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి మండల అధ్యక్షులు కుమరాపు రవి కుమార్, పైల విష్టుమూర్తి, మీసాల రవి, ఎఎంసీ ఉపాధ్యాక్షులు బురాడ వెంకటరమణ, పీఎసీఎస్ అధ్యక్షులు బెవర జగన్నాధరావు, నక్క మురళీ, బీజేపీ జిల్లా కార్యదర్శి వజ్జపర్తి రఘురాం, సిర్రా లక్ష్మీ, దౌలూరు వెంకటరమణ, వివి గోపాలరావు పాత్రో, రైల్వే జోనల్ సలహా సభ్యులు బాలబొమ్మ వెంకటేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు టంకాల మౌళీశ్వరరావు, సర్పంచ్ సాకేటి నాగరాజు, ముద్దాడ తహసీల్దార్ ఎం.సరిత, ఎంపీడీవో జి.రామకృష్ణారావు, ఎంఈఒ అరసాడ రవి, ముల్లు శ్రీనివాసరావు, ఎఒ బి.బాజ్జి పాఠశాల ప్రదాన ఉపాధ్యాయులు, ఉపాద్యాయులు విద్యార్థులు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వడ్డినవలస-బుడితి రోడ్డుపై తేలిన రాళ్లు



**సారవకోట, డిసెంబరు 5(వార్త):** వడ్డినవలస నుంచి బుడితి వైపు వెళ్లే ప్రధాన రహదారిపై రాళ్లు తేలిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు రెండు నెలల క్రితం రోడ్డు నిర్మాణం కోసం పెద్దఎత్తున రాళ్లు వేసి రోలింగ్ పూర్తిచేసినా, తదుపరి పనులు నిలిచిపోవడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కొన్ని రోజులుగా వాహనాల రాకపోకలతో రాళ్లు పూర్తిగా తేలిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడింది. చిన్నపిల్లలు, వృద్ధులు ప్రయాణించే సమయంలో కూడా తరచూ జారిపడే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనులు ఎందుకు నిలిచిపోయాయో అధికారులు స్పష్టత ఇవ్వాలని, రహదారి పనులను తక్షణమే పునఃప్రారంభించి రోడ్డు పూర్తి చేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సంబంధిత శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## చిన్నారి లవిత ప్రతిభ



**నరసన్నపేట, డిసెంబరు 5(వార్త):** స్థానికంగా చదువుతున్న నాలుగో తరగతి విద్యార్థి జామి లవిత రాష్ట్ర స్థాయి బాస్కెట్బాల్ ఛాంపియన్షిప్‌లో మెరిసి ప్రతిభను చాటడు. ఎన్టీఆర్ జిల్లా బాస్కెట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో జరుగుతున్న 'ఏపీ అంతర్ జిల్లాల బాస్కెట్బాల్ ఛాంపియన్షిప్%-%2025' పోటీల్లో అండర్%-%11 విభాగంలో శ్రీకాకుళం జిల్లా తరఫున లవిత ప్రాతినిధ్యం వహించిండు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి భారీ సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో లవిత తన ఆటతీరు, పట్టుదల, చురుకుదనంతో ఆకట్టుకుని శ్రీకాకుళం జిల్లాకు మూడో స్థానాన్ని సాధించిపెటడు. చిన్న వయసులోనే రాష్ట్ర స్థాయి వేదికపై నిలిచిన థానా ప్రతిభపై పాఠశాల అధ్యాపకులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. లవిత మరింత ఎత్తుకు ఎదిగి రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెరుగైన విజయాలు సాధిస్తుందనే నమ్మకాన్ని స్థానికులు వెలిబుచ్చారు. చిన్నారి క్రీడా ప్రయాణంలో ఇది ఒక గొప్ప అడుగంటూ అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

## అయోధ్య బయలుదేరిన రామ మాలధారణ భక్తులు



**సోంపేట, డిసెంబరు 5(వార్త):** సోంపేటలో 41 రోజులు దీక్ష పూర్తి చేసుకొని రామ మాల ధరించిన పలువురు భక్తులు శుక్రవారం అయోధ్యకు పయనమయ్యారు. దీక్ష కాలంలో రెండు పూటలా సన్నిధానంలో భక్తిశ్రద్ధలతో పూజలు చేసి రామకోటి లిఖించి అనేక సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి అయోధ్యతోపాటు పలు పుణ్యక్షేత్రాల సందర్శనకు ప్రయాణం అవుతున్నట్లు తెప్పల రవి గురుస్వామి తెలిపారు.

## క్రీడాకారులకు ఆర్థిక సాయం

**ఇచ్ఛాపురం, డిసెంబరు 5(వార్త):** జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన కేజీబీవీ పాఠశాల విద్యార్థినికి అలయన్స్ క్లబ్ సభ్యులు ఐదువేలు ఆర్థిక సాయం అందించారు. దీంతోపాటు స్విమ్మింగ్ డ్రెస్ కూడా అందజేశారు .గుమ్మడి శైలజ ఢిల్లీలో జరగనున్న పోటీలో పాల్గొంటారు.బత్తుల వెంకట రమణ అందించారు. కార్యక్రమంలో ఉమా శంకర్,వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే బగ్గుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నేతలు



**నరసన్నపేట, డిసెంబరు 5(వార్త):** ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి జన్మదినం 7న సందర్భంగా, గురువారం (05-12-2025) ఆయన స్వగ్రామం మాబగంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జన్మదిన పోస్టర్‌ను ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి%-%సుగుణమ్మ దంపతులు ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి, కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే రమణమూర్తికి పార్టీ నాయకులు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయన ప్రజా సేవ మరింత వ్యాప్తి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అడపా చంద్రశేఖర్, క్లస్టర్ ఇంచార్జ్ రావాడ కృష్ణ, పట్టణ అధ్యక్షులు కింజరాపు రామారావు, నీటి సంఘం అధ్యక్షులు శిమ్మ లక్ష్మణ్ రావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు రావాడ గణపతి, సభ్యులు బగ్గు రవికుమార్, కోల తిరుమల, అలాగే అనేక మంది పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామంలో ఉత్సాహభరితమైన వాతావరణంలో ఈ కార్యక్రమం విశిష్టంగా జరిగింది.

# విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి : సలాన

**మెళియాపుట్టి, డిసెంబరు 5(వార్త):** నేటి సమాజంలో విద్యతో దేన్నైనా సాధించవచ్చునని కోసమాల పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు అన్నారు మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు మెగా పేరెంట్స్ మీటింగ్ 3.0 కార్యక్రమాన్ని శుక్రవారం నాడు నిర్వహించారు. దీంట్లో భాగంగా మెళియాపుట్టి మండల కేంద్రంలోనున్న ఎస్ డి ఆర్ ఆర్ ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూరిబా పాఠశాల, మండల పరిషత్ పాఠశాల, నలంద పబ్లిక్ స్కూల్, తోపాటు మండలంలో పాఠశాలల్లో ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ 3.0 సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యతోనే అధిక ప్రాధాన్యత లభిస్తుందని, కాలాన్ని సద్వినియోగం చేసుకొని ప్రణాళిక యుక్తంగా ముందుకు సాగాలని వక్తలు పలువురు విద్యార్థులకు సూచించారు. మన పిల్లలు పాఠశాలలో ఏం చదువుతున్నారు తదితర వాటిపై తల్లిదండ్రులు వారిపై వ్యక్తిగత కేర్ తీసుకోని ప్రోత్సహించాలన్నారు. పాఠశాలలోనున్న ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యార్థుల తల్లిదండ్రులకు మధ్య ఒక వారధిగా వ్యవహరించిన నాడు విద్యార్థి అన్ని రంగాలలో రాణించి సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని పలువురు కూటమి నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఎస్ ఓ రమ్య, సహఉపాధ్యాయుల సూచనలు సలహాలతో విద్యార్థులు వినూత్నమైన వివిధ రకాల ప్రాజెక్టులను తయారుచేసి పాఠశాల ఆవరణలో మెగా పేరెంట్స్ ఈవెంట్ కార్యక్రమంలో వాటిని ప్రదర్శించటంతో అధికారులు ప్రజాప్రతినిధులు వాటిని చూసి అభినందించారు.

ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు సలాన్ మోహన్ రావు తో పాటు తహసిల్దారు పాపారావు, ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నరసన్నపేట కళాశాలకు పూర్వ విద్యార్థి డా. మురళి రూ.50వేల విరాళం



**నరసన్నపేట, డిసెంబరు 5(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ కార్యక్రమానికి ప్రముఖ వైద్య నిపుణులు డా. బలగ మురళి ప్రధాన అతిథిగా హాజరయ్యారు. 1987-1989 మధ్యకాలంలో ఇదే కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించిన ఆయన, విద్యాసంస్థ పట్ల తన అనుబంధాన్ని మరోసారి ప్రదర్శించారు. పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని కళాశాల సదుపాయాల అభివృద్ధికి డా.మురళి రూ.50వేల విరాళాన్ని ప్రకటించారు. ఈ నిధులను అవసరమైన పరికరాలు, వనరులు కొనుగోలు చేయడానికి వినియోగించనున్నట్లు కళాశాల ఉపాధ్యాయులు తెలిపారు. తమ విద్యాభివృద్ధికి పునాదిలా నిలిచిన కళాశాల ఎదుగుదల కోసం చేయూతనివ్వడం తనకు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. కళాశాల సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు డా. మురళి చేసిన ఉదార సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఉజ్వలమైన భవిష్యత్తును అందిపుచ్చుకోవాలి

**- పేరెంట్, టీచర్, స్టూడెంట్ల కలయిక గొప్ప ఆలోచన**

**- సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పైడి పద్మావతి**



**సరుబుజ్జిలి, డిసెంబరు 5(వార్త):** విద్యార్థులు చదువుతోపాటు మంచి బుద్ధులు, అలవాట్లను కలిగి ఉజ్వలమైన భవిష్యత్తును అందిపుచ్చుకోవాలని సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పైడి పద్మావతి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, ఇంటర్మీడియట్ విద్య ఉన్నతాధికారుల సూచనల మేరకు శుక్రవారం సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ 3.0 సమావేశం ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశ ప్రారంభోత్సవంలో ప్రిన్సిపాల్ పైడి పద్మావతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పేరెంట్ టీచర్స్ మీటింగ్ చాలా గొప్ప ఆలోచనగా అభివర్ణించారు. పేరెంట్, టీచర్, స్టూడెంట్‌ల కలయికతో వారివారి పిల్లల లోటుపాట్లు, చదువుల తీరుతెన్నులు, వారి సత్ ప్రవర్తన తదితర విషయాలను నేరుగా పేరెంట్స్‌కే తెలియజేయడం జరుగుతుందన్నారు.

### లక్ష్యాలను నిర్దేశించుకుని..

మండల జెడ్పీటీసీ సభ్యులు ఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను నిర్ధేశించుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. టాపర్‌గా నిలిచిన విద్యార్థికి రూ. 5వేలు నగదు బహుమతిని అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ప్రసంగించారు. విద్యార్థులు ప్రొగ్రెస్ కార్డులను పేరెంట్స్ కు చూపించి వారి మార్కులు, స్థితిగతులను లెక్చరర్లు వివరించారు. పేరెంట్స్ తో కలిసి విద్యార్థులు పంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటి ఛైర్మన్ ఇల్లాకల ప్రభాకరరావు, మామిడి సింహాచలం, స్థానిక ప్రజాప్రతినిధులు, రమేష్ సాహు, యూడీసీ రమేష్, వినోద్ రాజ్, శ్రీనివాసరావు, గోవిందరావు, విజయ్ కుమార్, విజయ, గౌతమవీణ,



## కంటి వైద్య శిబిరంలో 45 మందికి పరీక్షలు,



**సారవకోట, డిసెంబరు 5(వార్త):** సారవకోట సచివాలయం ఆవరణలో శుక్రవారం వృద్ధుల కోసం ప్రత్యేక కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా అందత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి 45 మంది వృద్ధులు హాజరయ్యారు. వైద్య బృందం 'దివ్యాంజలి' కంటి పరీక్షలు నిర్వహించి, చూపు సమస్యలు, ముత్యబిందు లక్షణాలు వంటి అంశాలను పరిశీలించింది. అవసరమైన వారికి శస్త్రచికిత్స కోసం విజయనగరం కంటి ఆసుపత్రికి తరలించే చర్యలు చేపట్టారు. స్థానికులు ఈ శిబిరాన్ని ప్రశంసిస్తూ, ఇలాంటి వైద్య సేవలు నిరంతరం అందించాలని అభిప్రాయపడ్డారు.

## డిగ్రీ కళాశాలలో 'కెరీయర్ ఆప్షన్స్'




**నరసన్నపేట, డిసెంబరు 5(వార్త):** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం "కెరీయర్ ఆప్షన్స్, దెయిర్ ఒపీనియన్స్" పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.లత మాట్లాడుతూ, విద్యార్థుల నైపుణ్యాలను గుర్తించి, వారికి సరైన దిశలో మార్గనిర్దేశం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. డిగ్రీ స్థాయిలోనే విద్యార్థులు తమ భవిష్యత్తు గురించిన స్పష్టమైన అవగాహన ఏర్పరుచుకోవడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలు, వాటిలో స్థిరపడేందుకు అవసరమైన అర్హతలు, నైపుణ్యాలపై విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో యాప్ బ్రేక్‌డౌన్



**నరసన్నపేట, డిసెంబరు 5(వార్త):** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉపయోగించే మొబైల్ యాప్ పనిచేయకపోవడంతో రైతులు తప్పని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళ్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యాన్ని విక్రయించేందుకు ముందు ట్రాక్ షీట్ జనరేషన్ తప్పనిసరి. అయితే దీనికోసం కేటాయించిన యాప్ సాంకేతిక సమస్యలతో నిలిచిపోవడంతో, వాహనాలతో మిల్లులకు చేరుకున్న రైతులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. యాప్ సక్రమంగా పనిచేయకపోవడంతో ధాన్యం కొనుగోలు జరుగుతుందా లేదా అన్న అనిశ్చితి రైతులలో పెరిగింది. రోజంతా వేచి ఉండి కూడా ప్రక్రియ పూర్తికాకపోవడంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రైతులు సంబంధిత అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని యాప్ లోపాలు సరిచేసి, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## రావులవలస పాఠశాలలో మెగా పీటీఎం సందడి



**నరసన్నపేట, డిసెంబరు 5(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా పీటీఎం కార్యక్రమానికి రావులవలస జడ్పీ పాఠశాలలో తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ పేడాడ దాలినాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు స్వయంగా అందజేశారు. విద్యార్థుల అభ్యాస పురోగతి, విద్యా నాణ్యత, హాజరు శాతం, వ్యక్తిగత ప్రతిభ తదితర అంశాలపై తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో పాఠశాల%-%తల్లిదండ్రుల సమన్వయం అత్యంత ముఖ్యమని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం బండి శ్రీరామ్ మూర్తి, ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తల్లిదండ్రులు కూడా పాఠశాల అభివృద్ధి, పిల్లల చదువు గురించి సానుకూల సూచనలు అందించారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహవంతంగా సాగింది.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి వినతి

**నరసన్నపేట, డిసెంబరు 5(వార్త):** క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఆర్పీ యూనియన్ జిల్లా కోశాధికారి ఢిల్లీశ్వరరావు తహశీల్దార్ రామారావును కలిసి వినతిపత్రం సమర్పించారు. విద్యా శాఖలో విలీనం చేసి సీఆర్పీగా రెగ్యులర్ చేసే అవకాశం కల్పించాలని ప్రధానంగా విజ్ఞప్తి చేశారు. అదేక్రమంలో రిటైర్మెంట్ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని, పీఎఫ్ మరియు గ్రాడ్యుటీ వంటి సేవా ప్రయోజనాలు కల్పించాలని కోరారు. తమ సేవలను గుర్తించి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు రవికుమార్, వైకుంఠరావు, మదన్, మాధవి, సరస్వతి పాల్గొని తమ సమస్యలను అధికారులకు వివరించారు.



## మెగా పేరెంట్స్‌టీచర్ మీటింగ్ విజయవంతం



**మందస, డిసెంబరు 5(వార్త):** మందస మండలంలో గల 124పాఠశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్-3.0 విజయవంతం మందస మండల విద్యాశాఖాధికారి మద్రిపాటి లక్ష్మణరావు తెలిపారు. పట్టులోగాం గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో టీఎల్ఎం వస్తువులు, విలువిద్య శిక్షణకు అవసరమైన గాండీవం పరిశీలించారు. హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ లో కూడా మెగా పేరేంటి టీచర్స్ మీటింగ్ 3.0 కార్యక్రమంలో పాల్గొన్నారు. కుసుమల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పాఠశాలకు అవసరమైన వంటగదిని దాతలు రూ.1,06000లు సహకారంతో నిర్మాణం పూర్తి చేయగా, వంటశాల ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ లు, గ్రామపెద్దలు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పాఠశాలకు మల్టీమీడియా స్పీకర్ వితరణ



**సోంపేట, డిసెంబరు 5(వార్త):** సోంపేట మండలం బారువా కొత్తూరు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ డే సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుడు గార రాజేష్ తన తండ్రి భాస్కరరావు జ్ఞాపకార్థం శుక్రవారం మల్టీమీడియా స్పీకర్ను పాఠశాలకు వితరణగా అందజేశారు. దీని పట్ల సాహఉపాధ్యాయులు, గ్రామస్తులు రాజేష్ మాస్టారును అభినందించారు. కార్యక్రమంలో మోహన్రావు, తాతయ్య, లోకనాథం, జోగారావు పాల్గొన్నారు.

## సమాజాన్ని ఉద్ధరించేందుకు చదువే మార్గం



**సోంపేట, డిసెంబరు 5(వార్త):** సమాజాన్ని ఉద్ధరించేందుకు చక్కనైన చదివే సరైన మార్గమని కంచిలి ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి, ఎమ్మెస్ పల్లి సర్పంచ్ కొనపల సురేష్ పేర్కొన్నారు. ఎమ్మెస్ పల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో శుక్రవారం మెగా పేరెంట్స్ మీట్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు వక్తలు విద్యార్థులకు అనేక విలువైన సూచనలు సలహాలు అందించారు. ఉపాధ్యాయుడు బృందావన్ దోలాయి ఇతర ఉపాధ్యాయులు చదువు యొక్క విశిష్టత ఆవశ్యకతను క్షుణ్ణంగా వివరించారు.

## ఉమాగిరి వద్ద ఆక్రమణ కూల్చివేత

**మందస, డిసెంబరు 5(వార్త):** జిల్లుండ పంచాయతీలో గల ఉమాగిరి గ్రామం వద్ద నిర్మిస్తున్న కట్టడాలను అధికారులు కూల్చివేశారు. ఈ నిర్మాణం ప్రారంభం నుంచే వివాదం కాగా.. డిప్యూటీ తహసీల్దార్ కింతలి రామకృష్ణ, జలవనరులశాఖ ఏఈ ఎస్వీ శ్రీనివాసరావు, రోడ్లు, భవనాలశాఖ ఏఈ డిక్కల విక్రం, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఇందిర, మండల సర్వేయర్ బొడ్డపాటి బాబురావు శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సునాముది కాలువపై అక్రమంగా ఆ నిర్మాణం జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. వివాదాలు, తగదాలు జరుగుతాయేమేనన్న అనుమానంతో మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు స్థానికులతో చర్చించారు. అనంతరం జేసీబీ సహయంతో నిర్మాణాలను తొలగించారు.



## విద్యాభివృద్ధికే ప్రభుత్వ ప్రాధాన్యం : బగ్గు





**పోలాకి, డిసెంబరు 5(వార్త):** మబగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ 3.0 సమావేశంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యాభవిష్యత్‌ను బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఒకే రోజున రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మందిని ఒకే వేదికపైకి తీసుకువచ్చే విధంగా మెగా పేరెంట్%-%టీచర్ మీటింగ్ నిర్వహించడం దేశంలోనే మరోసారి ఆంధ్రప్రదేశ్‌కు రికార్డుగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనతో ఈ భారీ కార్యక్రమం అమల్లోకి వచ్చిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహించిన ఇది మూడో మెగా కార్యక్రమమని ఎమ్మెల్యే గుర్తుచేశారు. తల్లిదండ్రులు ప్రభుత్వం, అధికారులు, ఉపాధ్యాయులతో నేరుగా సూచనలు, అభిప్రాయాలు పంచుకునే అవకాశం కల్పించడం పారదర్శక విద్యా వ్యవస్థకు నిదర్శనమని తెలిపారు. పాఠశాల మౌలిక సదుపాయాలు, బోధనా నాణ్యత, విద్యార్థుల సంక్షేమంపై విస్తృత చర్చలు జరగడం పాఠశాలల అభివృద్ధికి దోహదం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. క్యాంపస్ పర్యటనలో ప్రతి తరగతి గదిని సందర్శించిన ఎమ్మెల్యే, విద్యార్థులకు లిప్ యాప్ వినియోగం పై ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. పిల్లల సమస్యలను నేరుగా తెలుసుకుని వారితో ఆత్మీయంగా ముచ్చటించారు. విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించి ప్రశంసించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, అడపా చంద్రశేఖర్, పిఎసిఎస్ ఛైర్మన్ భైరి భాస్కరరావు, రావాడ కృష్ణారావు, రావాడ గణపతిరావు, పల్లి శంకర్, శిమ్మ లక్ష్మణరావు, కింజరాపు రామారావు, కాయ రవి, బగ్గు రవి, కోల తిరుమల తదితరులు పాల్గొన్నారు. అలాగే డిప్యూటీ తహశీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ ఏడి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సచివాలయం సిబ్బంది , కూటమి నాయకులు హాజరయ్యారు.

## ఉన్నతమైన ఆలోచనలతో బంగారు భవిష్యత్



**సోంపేట, డిసెంబరు 5(వార్త):** విద్యార్థులు ప్రతి ఒక్కరు ఉన్నతమైన ఆలోచనలతో చదువుకొని బంగారు భవిష్యత్తు నిర్మాణానికి కృషి చేయాలని సోంపేట తహసిల్దార్ బి అప్పలస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ ఏ మోహన్ రావు ఆధ్వర్యంలో జరిగిన మెగా పేరెంట్స్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మంచి భవిష్యత్తుకు ఉపయోగపడే మెరుగైన విద్యను ఏకాగ్రతతో అభ్యసించి ఉన్నత విద్యలో మరింతగా రాణించి పోటీ పరీక్షలకు దృఢ సంకల్పంతో సిద్ధమై మెరుగైన ఫలితాలతో ఉజ్వలమైన భవిష్యత్తుకు పట్టుదలతో కృషి చేయాలని అన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి, రిటైర్డ్ గణిత ఉపాధ్యాయుడు కె జానకి రావు మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉత్తమ భవిష్యత్తుకు మంచి మార్గంలో పయనించాలని సూచించారు. మహిళా పోలీస్ సంధ్యారాణి సైబర్ క్రైమ్, డిజిటల్ అరెస్ట్ గూర్చి మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు యుగంధర్, ప్రవీణ్, శ్రావణ్, రామినాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### రామయ్యపట్నంలో...

రామయ్యపట్నం తీర గ్రామంలో మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు నగిరి మోహన్ రావు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద నెట్ట గోపాల్, అంగన్వాడి కార్యకర్త మద్దు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

### కవిటిలో...

కవిటి మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సింహాచలం అధ్యక్షతన మెగా పేరెంట్స్ డే శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హాజరైన పలువురు అతిథులు మాట్లాడుతూ విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు అవసరమైన నైపుణ్యాలు ప్రయత్నాలు గూర్చి వివరించారు.

### బూరగాంలో....

కంచిలి మండలం బోరగాం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సోమేశ్వరరావు అధ్యక్షతన మెగా పేరెంట్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులకు దిసానిద్దేశం చేశారు.

## సత్యసాయి విద్యా విహార్‌కు అఖండ జ్యోతి



**పలాస, డిసెంబరు 5(వార్త):** ఆత్మీయ ఐకమత్యం- మనమంతా ఒక్కటే అనే నినాదముతో ఆగస్టు 17 న ప్రశాంతినిలయములో అఖండ జ్యోతి ప్రయాణం మొదలై దేశ నలుదిశలా తిరుగుతూ 2026 ఏప్రిల్ 24న స్వామివారి ఆరాధనా దినోత్సవం సరికి తిరిగి ప్రశాంతినిలయము చేరుకొనే దివ్య ప్రణాళికలో బాగంగా శుక్రవారం ఒరిస్సా రాష్ట్రం పర్లాకిమిడి నుండీ శ్రీకాకుళం జిల్లా పలాస మండలము రామకృష్ణాపురం గ్రామంలో వున్న శ్రీ సత్యసాయి విద్యావిహార్ కు చేరింది. సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు మాట్లాడుతూ ఈ జ్యోతి దర్శనము సర్వ పాప నాశనము అని తెలియచేస్తూ ఈ అఖండజ్యోతి రానన్న 3 రోజుల పాటు స్కూల్ వద్దనే ఉంటుంది అని తెలియచేస్తూ దర్శనానికి భక్తులకు ఆహ్వానించినారు. అఖండ జ్యోతి అంటే నిరంతరం వెలిగే, భస్మించని దీప జ్వాల, దేవాలయాలలో భక్తులు దీనిని పూజిస్తూ ఇంధనం ఉచితంగా అందిస్తారు అన్నారు. ఇది దైవ శక్తి ప్రతీకగా భావించబడుతుందాని చెప్పారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో రామక్రిష్ణపురము శ్రీ సత్యసాయి విద్యావిహార్ ట్రస్ట్ ఉప అధ్యక్షులు తాలాసు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరీ, ఇప్పిలి తిరుమల, పొట్నూరు కొండలరావు, మద్ది కామేశ్వరరావు, తాలాసు సూర్యప్రకాశ్, దోకి జగదీష్, తాలసు దుర్గా, డాక్టర్ పాడి, శేషగిరి గుప్తా, శ్రీ సత్యసాయి విద్యావిహార్ పర్లాకిమిడి, అధ్యక్షులు నారాయణమూర్తి, సెక్రటరీ సిందిరి మురళీ పాల్గొన్నారు.

జాతీయ

# వార్త

తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం





## చల్లవానిపేట జడ్పీ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం

**జలుమూరు, డిసెంబరు 5(వార్త):** చల్లవానిపేట జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రుల కోసం భోజన ఏర్పాట్లకు సర్పంచ్ శ్రీ పి. రామచంద్రరావు గారు ?5,000 విరాళం అందించడం పాఠశాల వర్గాల్లో అభినందనీయంగా నిలిచింది. పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పాటుగా, కీర్తిశేషులు శ్రీమతి డి. విజయగౌరి గారి జ్ఞాపకార్థం ఆమె కుమారుడు శ్రీ డి. భానుప్రకాష్ మాస్టర్ గారు కూడా ?5,000 విరాళం అందజేశారు. ఈ నిధులు పాఠశాల సదుపాయాల అభివృద్ధికి వినియోగించనున్నట్లు హెడ్‌మాస్టర్ తెలిపారు. సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ హెచ్.ఎం మరియు పాఠశాల బోధనా సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు. గ్రామీణ విద్యాభివృద్ధి పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, దాతలు చూపిన ఆసక్తి పాఠశాల ప్రగతికి శుభసూచకమని పేర్కొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్‌కు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేయాలి

### -ఎమ్మెల్యే గౌతు శిరీష

**పలాస, డిసెంబరు 5(వార్త):** విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేయాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సూచించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష పలాస మండలం బ్రాహ్మణతర్ల గ్రామంలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కి శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సహకారం విద్యార్థులకు వ్యక్తిగతీకరించిన అభ్యాసం, స్థిరమైన కమ్యూనికేషన్‌ను అందిస్తుంది, ఇది వారి బలాలు, బలహీనతలను గుర్తించి మెరుగైన మద్దతు ఇవ్వడానికి సహాయపడుతుందాని చెప్పారు. ఇల్లు-పాఠశాల మధ్య అతుకులు లేని మార్పు ఏర్పరచడం ద్వారా విద్యార్థులు స్థిరత్వం, ప్రేరణ పొందుతారని, ఫలితంగా విద్యాపర పనితీరు మెరుగవుతుందని అన్నారు. సామాజిక-భావోద్వేగ నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని, ఇది భవిష్యత్తులో విజయవంతమైన జీవితానికి పునాది వేస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో, విద్యార్థుల సమస్యలు, పాఠశాల అభివృద్ధి, ఉపాధ్యాయుల పనితీరు వంటి అంశాలపై చర్చించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేస్తే విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థు లకు మెరుగైన విద్యను అందించేందుకు పాఠశాలలో సౌకర్యాలను మెరుగుపరచాలని, ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన పాఠాలు బోధించాలని ఆమె సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పనిచేస్తే విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపడుతుందని, ఈ లక్ష్యం సాధించేందుకు కలిసి పనిచేద్దాం అని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.



కార్యక్రమంలో ఎంపీడీఓ వసంత్‌కుమార్, మండల విద్యాశాధికారి శ్రీనివాస్, పలాస ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాస రావు, దువ్వాడ కృష్ణమూర్తి, మండల టిడిపి పార్టీ అధ్యక్షులు కుత్తం లక్ష్మణ్, వంకల కూర్మారావు, పార్వతి, అవగాన దశరథ, ఆనంద్, సుదర్శన్ రావు, మురళీకృష్ణ, కుర్మా రావు, యాదగిరి, సింహచలం, అప్పారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాడుతా తీయగా విజేత హరి భాస్కర్



**సోంపేట, డిసెంబర్ 5(వార్త):** పలాసపురంలో వైభవంగా నిర్వహించిన శ్రీ దత్తాత్రేయ స్వామి వార్షికోత్సవంలో భాగంగా గురువారం రాత్రి జిల్లా స్థాయిలో నిర్వహించిన పాడుతా తీయగా పాటల పోటీల కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా కొనసాగింది. ఈ పోటీల్లో జింకిభద్ర గ్రామానికి చెందిన హరి భాస్కర్ ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు. మామిడిపల్లి కి చెందిన మోహిని, బోరివంకకు చెందిన శ్రీకృష్ణ, అరసవల్లికి చెందిన శ్రీధర్ వరుసగా ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచారు. అలాగే శ్రీకాకుళం నుంచి సాత్విక, మండపల్లి నుంచి వరలక్ష్మి శెట్టి కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నారు. స్థానిక సర్పంచ్ తడక జోగారావు, జడ్పిటిసి సభ్యురాలు తడక యశోద అలాగే గ్రామ పెద్దలు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తోటలోకనాదం, దుద్ది కోదండరావు, దేవాడ దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

## సమాజానికి మంచి పౌరులను అందించాలి



**పలాస, డిసెంబరు 5(వార్త):** విద్యార్థులను సమాజానికి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు కోరారు. శుక్రవారం పలాస గవర్నమెంట్ హై స్కూల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను సమాజానికి మంచి పౌరులుగా తీర్చిదిద్దడం అంటే వారిలో నైతిక విలువలు, జవాబుదారీతనం, సమాజ సేవా భావనను పెంపొందించడం. ఇందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాలలు కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల పాత్రఉపాధ్యాయులు పాఠాలతో పాటు జీవిత విలువలు, దేశభక్తి, సత్యసంధతను బోధించి విద్యార్థులను మార్గనిర్దేశం చేయాలని చెప్పారు. వారు విద్యార్థుల రకాలను అర్థం చేసుకుని, ముఖ్యంగా శ్రద్ధ లేని వారిపై ఎక్కువ దృష్టి పెట్టి మార్పు తీసుకురావాలని కోరారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి వారికి అర్థమయ్యేలా బోధన చేయడం కీలకమాని చెప్పారు. విద్యార్థినీ విద్యార్థుల ఉద్దేశించి సూచించారు. స్కూలు హెడ్మాస్టర్ రవికుమార్, పలాస ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటలక్ష్మి, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మెగా వైద్య శిబిరం విజయవంతం



**పలాస, డిసెంబరు 5(వార్త):** పలాస నియోజకవర్గం పూండి జూనియర్ కాలేజీ వద్ద ఎన్ ఎస్ ఎస్ వారోత్సవాలు సందర్భంగా మెగా వైద్య శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాసన సభ్యులు గౌతు శిరీష శుక్రవారం ప్రారంభోత్సవం చేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ఎన్ ఎస్ ఎస్ వారోత్సవాలు సందర్భంగా బాల బాలికలకు శుభాకాంక్షలు తెలియజేస్తు ప్రతీ ఒకరికి చదువు, ఆట పాటలతో పాటు విద్యార్థి దశ నుండి సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని, సమాజం లో జరుగుతున్న అనేక రకాల విషయాలను విద్యార్థి దశ నుండి తెలుసుకొనేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకొని విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చి దిద్దాలని వివరించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, సిబ్బంది ఇచ్చిన వినతుల తెలుకొని పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈమె తోపాటు పుచ్చ ఈశ్వరావు, గోవింద్ పాపారావు, రమణ, ప్రశాంత్ స్వామి, కృష్ణ, అఖిల్, బాలాజీ, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో నైపుణ్యత వెలికితీతకు కృషి చేయాలి

### -ఏపీపిటిసి చైర్మన్ వజ్జ బాబూరావు

**పలాస, డిసెంబరు 5(వార్త):** విద్యార్థుల్లో నైపుణ్యం వెలికి తీసేందుకు కృషి చేయాలని ఏపీపిటిసి చైర్మన్ వజ్జ బాబురావు ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ కు ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాలతో పలాస నియోజకవర్గం మున్సిపాలిటీ పరిధిలోని కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పలాస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పలాస మహాత్మా జ్యోతిరావు పూలే బిసి హైస్కూల్, పలాస మదర్ థెరీసా హైస్కూల్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీటీపీసీ చైర్మనన్ ఉపాధ్యాయులతో ఒక్కొక్కరితో చర్చ ( హెచ్ పిసి, అసెస్మెంట్ బుక్‌లెట్, ఎఫ్ ఎల్ ఎన్ ప్రగతి), టి ఎల్ ఎం ఎగ్జిబిషన్, ప్రధాన వేదికపై హెచ్ ఎం నివేదిక, ప్రతిపాదనలు, ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు విడిగా వీడియోలు ( ఎల్ ఈ ఏ పి యాప్, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, స్కిల్ ఎడ్యుకేషన్) ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి తిన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నమ్మ నాయుడు, జ్యోతిరావు పూలే పాఠశాల ప్రిన్సిపాల్ విద్యాసాగర్ రావు, ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు ఉన్నారు.




## విద్యార్థుల సమగ్రాభివృద్ధికే మెగా పేరెంట్ మీటింగ్

### -ఎమెల్యే గోవిందరావు

### -హిరమండలం కేజీబీవి అదనవు

### గదులను ప్రారంభించిన మామిడి



**హిరమండలం/ఎల్ఎన్ పేట, డిసెంబరు 5(వార్త):** విద్యార్థుల సమగ్ర అభివృద్ధికోసమే మెగా పేరెంట్ మీటింగ్ లు నిర్వహిస్తున్నామని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. శుక్రవారం హిరమండలం కేజీబిపీ పాఠశాల, కళాశాలలో నిర్వహించిన మొగా పేరెంట్ కు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు.ముందుగా కేజీబీవి పాఠశాలకు అధనపు గదులు, కంప్యూటర్, లైబ్రరీ రూమ్ లు,కాంపౌండ్ వాల్ నిర్మాణంకు 63.35 లక్షలు, కళాశాల అదనపు తరగతి గదులకు 1కోటి60లక్షలు సమగ్ర శిక్ష నిధులతో నిర్మించిన వాటికి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు నైపుణ్యాలను అందించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రతీ బాలికకు ఉత్తమ విద్యా వాతావరణం అందించడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేజీబివి పాఠశాల కళాశాల వసతులు మరింత అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల భవిష్యత్ బాగుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. మెగా పేరెంట్ మీటింగ్ అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పాఠశాలలో ఉన్న వసతులు, బోధన నాణ్యత ప్రమాణాలపై చర్చించి విద్యార్థులతో కలసి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపి ప్రతినిధి తిరుపతిరావుజడ్పిటిసి పొగిరి బుచ్చిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి రామక్రిష్ణారావు, ఎంపీడీవో కాశీప్రసాదరావు టిడిపి పట్టణ అధ్యక్షలు పోతురాజు శ్రీధర్, కెజీ బివీ ప్రిన్సిపాల్ ఎస్ కృష్ణవేణి, యాళ్ల నాగేశ్వరరావు,మండల టిడిపి అధ్యక్షులు ధారపు డిల్లేశ్వరరావు, పలువురు ఎంపీటీసీలు పలువురు ఎంపీటీసీలు సర్పంచులు,సర్పంచులు,కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు, విధ్యారునిల తల్లిదండ్రులు, విద్యార్థులు తధితరులు పాల్గొన్నారు.

## కాళింగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**నరసన్నపేట, డిసెంబరు 5(వార్త):** నరసన్నపేట ఎండిఓ కార్యాలయం లోని సమావేశ మందిరంలో నరసన్నపేట పట్టణ కాళింగ సంక్షేమ సంఘం మూడవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం విశిష్టంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సమావేశంలో సంఘ గౌరవ అధ్యక్షుల సమక్షంలో, కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు ఉప్పాడ పూర్ణారావు బాధ్యతలు స్వీకరించారు. ప్రారంభంలో స్వర్గీయ బొడ్డేపల్లి రాజగోపాల్ రావు చిత్రపటానికి గౌరవ అధ్యక్షులు, అధ్యక్షుడు, కోర్ కమిటీ సభ్యులు, కుటుంబ సభ్యులు కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోనంకి కృష్ణం నాయుడు మాట్లాడుతూ నరసన్నపేట కాళింగ సంక్షేమ సంఘం రాష్ట్రవ్యాప్తంగా విశేష సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోందని అభినందనలు తెలిపారు. గౌరవ అధ్యక్షులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ బలగ మురళి మాట్లాడుతూ, మూడు సంవత్సరాలలో సంఘం చేపట్టిన సేవా కార్యక్రమాలు అభినందనీయమని, కొత్త కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గౌరవ అధ్యక్షులు మార్పు విజయకుమార్, సనపల సోమేశ్వరరావు కూడా సంఘానికి అభినందనలు తెలియజేశారు. సహాధ్యక్షుడిగా సింగూరు శ్రీనివాసరావు, సెక్రటరీగా చింతాడ ధర్మారావు, జాయింట్ సెక్రటరీలుగా దానేటి గిరిధరరావు, సంపతి రావు శ్రీనివాసరావు, కోశాధికారిగా సువ్వారి మురళీధరరావు, ఆడిట్ కమిటీ సభ్యులుగా తమ్మినేని మహేశ్వరరావు, ఉప్పాడ వాసుదేవరావు, కోర్ కమిటీ సభ్యులుగా గురుబెల్లి గోపాలరావు, మొదలవలస అప్పలనాయుడు, సీపాన త్రినాధరావు, నూక బాలకృష్ణ, దుప్పట్ల మురళి, సీపాన కృష్ణారావు, హనుమంతు ఆనందరావు, మొదలవలస రాము, కూన వేణుగోపాలరావు, సీపాన త్రినాధులు, సింగూరు రేణు, కిల్లి లక్ష్మణరావు, సిగిలి పెల్లి ఆనందరావు, హనుమంతు సత్యనారాయణ, సంపతి రావు భాస్కరరావు, ఉప్పాడ ఉమాశంకర్, తమ్మినేని సుధాకర్, కొంకేన నాగరాజు, కొప్పలి షణ్ముఖరావు, గురుగు బెల్లి లక్ష్మారావు, కోత ధనరాజ్ మొదలైన వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నరసన్నపేట పట్టణ కాళింగ సంక్షేమ సంఘం కుటుంబ సభ్యులు, సభ్యులు భారీగా పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

## బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడికి ఘన సన్మానం



**పలాస, డిసెంబరు 5(వార్త):** బిజెపిఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులుగా పలాస కు చెందిన లక్కోజు ధర్మారావుని పార్టీ అధిష్టానము నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పార్టీ కార్యాలయంలో ఆయనను ఇచ్చాపురం పలాస టెక్కలి నియోజకవర్గాల బిజెపి నేతలు ముఖ్య అనుచరులు ఆర్ఎస్ఎస్ పరిచారకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు లక్కోజు ధర్మారావు మాట్లాడుతూ జిల్లాల్లో ఉన్న 36 మండలాల్లో ఓబీసీ కులాలను జాగృతము చేసి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతుగా శక్తికి మించి కృషి చేస్తానని, ఇందుకు జిల్లాలో గల అన్ని నియోజకవర్గాల్లో తమ నేతలు కార్యకర్తలు సహకారంతో ముందుకు వెళదామని, తనకు జరిగిన ఈ సత్కారం తనది కాదని ఇది ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్తకు చెందుతుందని, పార్టీలో కష్టపడి పని చేస్తే ప్రతి ఒక్కరికి పార్టీ గుర్తింపు ఇస్తుందని, తన సన్మానము ప్రతి కార్యకర్తకు అంకితం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా జోనల్ ఇన్చార్జి రౌతు చిరంజీవి రావు, మందస మండల పార్టీ అధ్యక్షులు తులుకుల సురేషు, వజ్రపుకొత్తూరు మండలం పూర్వపు అధ్యక్షులు మరణ మనోజ్ కుమార్, బిజెపి సీనియర్ నేత పేరాడ యోగేశ్వరరావు, బొండా శ్రీనివాసరావు వెంకట్రావు కూటమినేత, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ 18 వ వార్డు ఇంచార్జ్ హనుమంతు మురళీమోహన్ దొర, రామాయణం కృష్ణమాచార్యులు, రమేష్ బెహరా, బొమ్మరవెల్లి శ్రీనివాసరావు, లక్కోజు, శ్రీను, బర్తి రాజారావు, కిలారి ఢిల్లీశ్వరరావుతదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ..శాంతితో సమాజ స్థాపనకు పాటుపడదాం

### -ఎమ్మెల్యే గొండు శంకర్ స్పష్టం

### - తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ఘనంగా

### జరిగిన శ్రీకాకుళం డివిజన్ పాస్టర్స్ క్రిస్మస్

**శ్రీకాకుళం, డిసెంబరు 5(వార్త):** కరుణామయుడుగా యేసుక్రీస్తు ప్రభువు మంచి సమాజం కోసం ప్రేమ, శాంతి మార్గాలు చూపారని, ప్రభువు చూపిన మార్గంలోనే మంచి సమాజ స్థాపనకు అంతా పాటు పడాలని శ్రీకాకుళం శాసనసభ్యులు గొ0డుశంకర్ స్పష్టం చేశారు. శుక్రవారం శ్రీకాకుళం తెలుగు బాప్టిస్ట్ చర్చిలో, జిల్లా క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్, మరియు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ సంయుక్త నిర్వహణలో, శ్రీకాకుళం జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ , డాక్టర్ డి ఎస్ వి ఎస్ కుమార్ అధ్యక్షతన జరిగిన శ్రీకాకుళం డివిజన్ పాస్టర్స్ క్రిస్మస్ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్య క్రమానికి ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ క్రీస్తు మార్గం మానవాళికి అనుసర ణీయమని అన్నారు. క్రైస్తవ్యంతో తన కుటుంబ సభ్యులకు ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ముందుగా విజయవాడ నుంచి వచ్చిన బైబిల్ కాలేజీ ప్రొఫెసర్ రెవ. డా, కొడాలి విజయ్ కుమార్ మాట్లాడుతూ యేసు జననం, మరణం, పునరుత్థానం ప్రాముఖ్యమైనవని, చరిత్రలో క్రీస్తు ప్రభువుకే ఇది సాధ్యమని క్రిస్మస్ సందేశాన్ని వివరిం చారు. అనంతరం తెలుగు బాప్టిస్ట్ చర్చ్ నిర్వాహకులు డి ఎల్ బి ఎల్ కుమార్ మేరీ సుజాత దంపతుల ఆధ్వర్యంలో 500 మంది పాస్టర్స్ దంపతులకు నూతన వస్త్రాలను ఎమ్మెల్యే గొండు శంకర్ చేతుల మీదుగా అందించారు. స్త్రీల ఐక్య ప్రార్థన బలిపీఠం నిర్వాహ కురాలు డి. మేరీ సుజాత సౌజన్యంతో జరుగుతున్న ప్రార్థన క్యాలెండర్లను కొడాలి విజయ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్యాండిల్ సర్వీస్ ను ఎస్ ఎం యు పి ఎఫ్ అధ్యక్షులు రెవ, డా, కె. డానియల్ నడిపించారు. క్రిస్మస్ కేక్ కటింగ్ ఎమ్మెల్యే గొండు జరిపారు. తె.దే.పా నాయకుడు ఇప్పిలి తిరుమలరావు తో పాటు శ్రీకాకుళం ఆమదాల వలస, ఎచ్చెర్ల నరసన్నపేట, నియోజకవర్గం పాస్టర్లు, అధ్యక్ష కార్యదర్శులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## కూటమి పాలన ప్రశ్నార్థకం



**పోలాకి, డిసెంబరు 5(వార్త):** రైతన్న కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు అన్నీ ప్రచార ఆర్భాటమే తప్ప రైతుకు ప్రయోజనం చేకూర్చే చర్యలు గోచరించడం లేదని వైఎస్సార్సీపీ నాయకులు ఆరోపించారు. శుక్రవారం దీర్ఘాశిలో జరిగిన 'రైతన్న మీకోసం' కార్యక్రమం నేపథ్యంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజాప్రయోజనాల కంటే రాజకీయ లక్ష్యాలకు దగ్గరగా ఉన్నాయని విమర్శించారు. తాజాగా నిర్వహించిన రైతు సమావేశం పూర్తిగా టీడీపీ కార్యకర్తల సభలా మారిందని ఆయన అన్నారు. ఒక్క యూరియా బస్తా కోసం రైతులు పడిన కష్టాలు, ఎదురుచూపులు ఇప్పటికీ మరవలేని ముద్రవేశాయని గుర్తుచేసారు. రైతులకంటే దళారులకే ప్రాధాన్యం ఇస్తున్న కూటమి ప్రభుత్వం పేరు మార్చుకుని "దళారుల ప్రభుత్వం"గా మారాల్సిన పరిస్థితి దాపురించిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రెస్‌మీట్‌లో వైఎస్సార్సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి చింతు రాఘవరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు రావాడ అప్పన్నరాజు, మండల ప్రధాన కార్యదర్శి ఎం.వి.వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మందస జూనియర్ కళాశాలను రక్షించండి



**మందస, డిసెంబరు 5(వార్త):** మందస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రజలకు చెందినదని, ఎందరో పెద్దల కృషి ఫలితంగా ఏర్పడిందని కాంగ్రెస్ కమిటీ మందస మండల నాయకులు అన్నారు. ఈ మేరకు అధికారులకు వినాటిపత్రాలు అందజేశారు. మందస జూనియర్ కాలేజీను కబ్జానుండి కాపాడాలన్నారు. మందస గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ఎన్నో రాజకీయ వత్తిళ్ళు, ఒడిదుడుకులను అధిగమించి స్వర్గీయ మజ్జి తులసిదాసు కృషి ఫలితంగా సాధించుకున్నామన్నారు. కళాశాలకు స్థలాన్ని సేకరించుటకు మందస గ్రామస్తులు వడ్డి శంకరరావు బ్రదర్స్, స్వాతంత్ర సమరయోధుడు వడ్డి విశ్వనాథంలకు మజ్జి తులసీదాసు అర్ధించగా వారు పెద్ద మనసుతో అంగీకరించి, స్థలాన్ని కళాశాల నిర్మాణానికి దానం చేశారన్నారు. ఈ ప్రాంతంలో వెనుకబడిన లింగ్విస్ట్ మైనారిటీ ఒరియా ప్రజలు అంటే చాలా అభిమానించేవారని, వారికై పేద రైతు బిడ్డలకు ఉన్నత విద్యను అందించాలని ఆశయంతో స్థాపించిన కళాశాలను నేడు వాసుదేవ ఆలయ నిర్వాహకులు ఆక్రమించాలని చేస్తున్నప్రయత్నాలకు ప్రభుత్వం సహాయం చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. కాలేజీ విషయంలో ప్రభుత్వ జోక్యం విరమించుకోవాలని, లేనిచో దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు.

## నివగాం కళాశాల అభివృద్ధికి చర్యలు తీసుకోండి




**కొత్తూరు, డిసెంబరు 5(వార్త):** కొత్తూరు మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు బిల్లింగి సంజీవరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మరియు ఐటీ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ ను శుక్రవారం నాడు కలిశారు. ఈ సందర్భంగా నివగాం జూనియర్ కళాశాలకు పక్కా భవనాల నిర్మాణం కోసం ప్రత్యేకంగా వినతిపత్రం సమర్పించారు.సంజీవరావు మాట్లాడుతూ, నివగాం జూనియర్ కళాశాలను గతంలో తెలుగుదేశం ప్రభుత్వమే మంజూరు చేసిందని గుర్తుచేశారు. అయితే కళాశాల భవనాలకు ఆమోదం లభించిన కొద్ది కాలానికే ప్రభుత్వం మారడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయని వివరించారు.ఇటీవలి కాలంలో కళాశాల అభివృద్ధికి ఎటువంటి నిధులు అందకపోవడంతో, గ్రామ పెద్దలు మరియు దాతలు స్వయంగా ముందుకు వచ్చి సేకరించిన నిధులతో తాత్కాలికంగా నాలుగు రేకుల షెడ్ల గదులను నిర్మించినట్లు తెలిపారు. కనీస వసతులు లేకున్నా, ఈ కళాశాల విద్యార్థులు ప్రతీ ఏటా మంచి ఫలితాలు సాధిస్తున్నారని మంత్రివర్యులకు వివరించారు.కళాశాల స్థాపనకు సంబంధించిన డిక్లరేషన్ పత్రాలు మరియు సంబంధించిన ఇతర డాక్యుమెంట్లను లోకేష్ బాబుకు అందజేసిన సంజీవరావు, కొత్తగా ఏర్పడిన ఎన్‌డీఏ ప్రభుత్వం తక్షణమే స్పందించి నివగాం జూనియర్ కళాశాలకు శాశ్వత భవనాల మంజూరు చేయాలని, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ఆవశ్యకతను సూచించారు.

## రోలర్ బాస్కెట్ బాల్‌లో స్వర్ణభారతి విద్యార్థుల ప్రతిభ

**ఇచ్ఛాపురం, డిసెంబరు 5(వార్త):** విజయవాడలో గత నెల లో జరిగిన రాష్ట్ర స్థాయి రోలర్ బాస్కెట్ బాల్ ఛాంపియన్స్ షిప్ పోటీలో స్వర్ణ భారతీ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు.యోగేష్,సంతోష్ దొర, మధు మోహన్,కౌశిక్ లను చైర్మన్ చాట్ల తులసీదాసు రెడ్డి అభినందించారు.కో ఆర్డినేటర్ మహేశ్వరి రెడ్డి, కోచ్ చంద్రవతి,ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546